

కలెక్టర్ వెబ్‌సైట్‌లో ఆస్పత్రుల జాబితా

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో అనుమతి, రిన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్స్, డెంటల్ క్లినిక్‌ల జాబితాను సంగారెడ్డిలోని కలెక్టరేట్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు-2010 ప్రకారం జనవరి 1 నుంచి ఈ నెల 19 వరకు దరఖాస్తు చేసుకున్న జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదులుంటే ఆధారాలతో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.



సంగారెడ్డి జీజీహెచ్ ప్రాంగణంలో తుది దశకు చేరుకున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

'క్రిటికల్ కేర్ యూనిట్'

పనులు చకచకా..

- సంగారెడ్డిలో రూ.23.75 కోట్లతో భవనం
- వచ్చే నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో 50 పడకలతో నిర్మిస్తున్న క్రిటికల్‌కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. నిర్మాణ పనులు దాదాపు తుదిదశకు చేరుకున్నాయి. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో మూడంతస్తుల్లో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ భవనానికి 2023 మార్చి 6న శంకుస్థాపన చేశారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారితో పాటు అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నవారికి అత్యవసర వైద్య సేవలందించి ప్రాణాలు కాపాడేందుకు క్రిటికల్‌కేర్ యూనిట్ దోహదపడనుంది. సంగారెడ్డి జిల్లా నుంచి వెళ్లే రెండు హైవేలపై నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పరిస్థితి విషమంగా ఉంటే హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తే అత్యవసర పరిస్థితుల్లోనూ ఇక్కడే వైద్య చికిత్సలు అందే అవకాశం ఉంటుంది. టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మే 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు.

తొలి గంటలో మెరుగైన వైద్యం

ప్రమాదం జరిగిన తొలి గంట సమయంలో అత్యవసర వైద్యం అందితే ప్రాణాలు నిలిపేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రమాద బాధితులను హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించే క్రమంలో మార్గమధ్యలో మృత్యువాతపడుతున్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి వస్తే అత్యాధునిక సదుపాయాలతో అత్యవసర చికిత్సలు ఇక్కడే అందుబాటులోకి రానున్నాయి. క్షతగాత్రులకు ప్రాణహాని తప్పుతుంది.

-అనిల్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

బంతి బంతికి పందెం

ఐపీఎల్ వేళ జోరుగా దందా

- ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు
- ఈజీ మనీ కోసం ఆరాటం
- రూ. లక్షల్లో నష్టపోతున్న యువత
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఆగని బెట్టింగ్‌లు
- సాయంత్రం కాగానే టీవీలకు అతుక్కుపోతున్న యువత

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ వేళ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. సాయంత్రం అయ్యిందంటే యువత టీవీలకు అతుక్కుపోతున్నారు. ఫలానా క్రికెటర్ సెంచరీ చేస్తాడని, ఫలానా జట్టు గెలుస్తుందని బెట్టింగ్‌లు కడుతూ లక్షల రూపాయల్లో నష్టపోతున్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా బెట్టింగ్ దందా మాత్రం ఆగడం లేదు. ఈజీ మనీ కోసం యువత ఈ ఊబిలోకి దిగుతున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే

క్రికెట్ బెట్టింగ్‌లన్నీ ఆన్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. పలు యాప్‌లు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాయి. ముందుగా ఆయా యాప్‌లలో తమ వివరాలు పొందుపరుస్తూ రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. బెట్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారిని ఎంపికచేసి ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేస్తాయి. ఆ తరువాత బెట్టింగ్‌లకు అనుమతినిస్తున్నాయి. బంతి బంతికీ, సిక్స్, ఫోర్‌లకు కూడా బెట్టింగ్ నడుస్తున్నది. ఈజీ మనీకి ఆశపడి యువత, విద్యార్థులు బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలవుతున్నారు. చేతిలో ఉన్న డబ్బును పోగొట్టుకున్న తర్వాత.. డబ్బు తిరిగి రాబట్టుకోవాలనే ఆత్రంతో మళ్లీ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. చివరకు లక్షల రూపాయల్లో నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

హెచ్చరిస్తున్నా ఉపయోగం లేదు

బెట్టింగ్‌లపై పోలీసులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ యువత మేల్కోవడం లేదు. బెట్టింగ్ యాప్‌లపై, వాటిని ప్రమోట్ చేస్తున్నవారిపై ఓవైపు పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. బెట్టింగ్‌లకు పాల్పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దంటూ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అయినా యువత ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇందులో డబ్బులు పోగొట్టుకున్నవారే కానీ.. సంపాదించనవారు లేరని తెలిసీ ఊబిలోకి దిగుతున్నారు.

ఆశ పడితే మొదటికే మోసపోతారు



ఈజీ మనీ కోసం ఆశపడతే మోసపోతారు. సులువైన సంపాదన కోసం సైబర్ నేరగాళ్లు విసిరే వలలో యువత చిక్కుకోవద్దు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై, సైబర్ నేరాలపై జిల్లావ్యాప్తంగా విస్తృతంగాప్రచారం నిర్వహిస్తున్నాం.

-పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ



పటాన్‌చెరులో 'హైడ్రా' పర్యటన

- 'ప్రజావాణి' ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన
- అనుమతి పత్రాలు సమర్పించాలని ప్రణీత్‌కౌంటికి సూచన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రసాయిలో పర్యటిస్తున్నారు. గురువారం పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ఫిర్యాదుదారులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పటాన్‌చెరులోని ప్రణీత్ కౌంటీకి ఆనుకొని వెళ్తోన్న నక్కవాగు నాలాను పరిశీలించారు. బఫర్ జోన్‌తో కలిపి 36 గజాలు ఉండాల్సిన నాలా సగం వరకు కబ్జా అయినట్టు గుర్తించారు. భవన నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతి పత్రాలు సమర్పించాలని నిర్మాణ సంస్థకు సూచించారు. రికార్డుల ప్రకారం నాలా వెడల్పు లేని పక్షంలో ఆక్రమణలు తొలగించాలని స్థానిక మునిసిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మసీదు బండ ప్రాంతంలో జంగంకుంటను కొందరు కబ్జా చేస్తున్నారన్న ఫిర్యాదుతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆయన ఇప్పటికే అక్కడ ఇళ్లు కట్టుకొని ఉంటోన్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మున్ముందు కబ్జా జరగకుండా చూస్తామన్నారు. గచ్చిబౌలి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లే అవుట్‌ను పరిశీలించిన రంగనాథ్, రహదారులు, పార్కు స్థలాల్లో కన్వెన్షన్లు నిర్మించి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్టు గుర్తించారు. షేక్‌పేటలోని ఎర్రకుంట చెరువు, నెక్నాంపూర్‌లో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద ప్రహరీ నిర్మించి, రోడ్డు మూసివేశారన్న ఫిర్యాదును పరిశీలించారు. అదే ప్రాంతంలోని ఓ లే అవుట్‌లో పార్కు, ప్రజావసర స్థలాల కబ్జాను తనిఖీ చేశారు. నెక్నాంపూర్ సర్వేనంబర్ 20లో ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు.

నవోదయ.. ఎవరిదయా?

విద్యాలయం కోసం.. నేతల పోటీ

అందోలులో ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ పట్టు

అమీన్‌పూర్ కోసం ఎంపీ రఘునందన్‌రావు బెట్టు



జోగిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో పీవీ నరసింహారావు మంత్రిగా ఉన్నప్పుడు నాటి ప్రధాని రాజీవ్ ఆమోదంతో 1986లో దేశవ్యాప్తంగా ప్రతీ జిల్లాకు ఒకటి చొప్పున నవోదయ విద్యాలయాలు స్థాపించారు. అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లాలో గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గల్ మండల కేంద్రంలో ఈ విద్యాలయం ఏర్పాటయింది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాకూ ఒక నవోదయ మంజూరైంది. అది ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై మంత్రి దామోదర్, ఎంపీ రఘునందన్ రావు మధ్యన తీవ్ర పోటీ నెలకొన్నది.

అందోలు కోసం దామోదర్ పట్టు

అందోలు నియోజకవర్గంలోని అందోలు పట్టణంలో ఏర్పాటు చేయించాలన్న పట్టుదలతో దామోదర ఉన్నారు. ఇందుకోసం ఆయన మొదటగా మునిపల్లి మండలాన్ని ఎన్నుకున్నారు. అయితే అక్కడ స్థలాభావంతోపాటు, ఇప్పటికే అందోలు -జోగిపేటమున్సిపాలిటీ.. వివిధ విద్యా సంస్థలతో ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుకున్న నేపథ్యంలో.. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలోనే ఈవిద్యాలయ ఏర్పాటుకు మంత్రి మొగ్గు చూపారు. ఇందుకోసం ఆయన... అందోలు శివార్లలోని 1141 సర్వే నంబరులోని సుమారు 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. నవోదయ విద్యాసమితి వారు కూడా ఈస్థలాన్ని పరిశీలించారు. ఇదే విద్యాలయం ఏర్పాటు కోసం మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు కూడా తనవంతుగా ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉండడంతో, ఆయన ఢిల్లీలోని పెద్దల ద్వారా తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్‌లోని అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈ నవోదయ స్కూల్ ఏర్పాటు చేయాలని రఘునందన్‌రావు బెట్టు చేస్తున్నారు.

అందోలు వైపే కేంద్ర బృందం మొగ్గు

నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం.. కేంద్ర నవోదయ విద్యాలయ సమితి అధికారుల బృందం అందోలు వైపే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. గత నెల ఢిల్లీ నుంచి వచ్చిన నవోదయ అధికారుల బృందం ఈరెండు నియోజకర్గాల్లోనూ పర్యటించింది. అమీన్‌పూర్ రవాణా పరంగా మంచిదే అయినప్పటికీ అక్కడ విద్యాలయం ఏర్పాటుకు తగినంత స్థలం లేకపోవడం డ్రాబ్యాక్ అయిందని చెప్పవచ్చు. అందోలులో తగినంత (సుమారు 25 కు పైగా ఎకరాలు) భూమి అందుబాటులో ఉండడం, రవాణా పరంగా ఈజీ యాక్సెసిబిలిటీ ఉండడం, నైసర్గికంగా జిల్లా మధ్యలో ఉన్న నేపథ్యంలో.. అందోలు నియోజకవర్గంలోని అందోలు వైపే నవోదయ అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. ఇందులో భాగంగానే, వచ్చే విద్యాసంవత్సరం నుంచి, పుల్కల్ మండలంపోచారం గ్రామంలో నవోదయ పాఠశాలను ప్రారంభించాలని డీఈవో వెంకటేశ్వర్లు గత నెలలో పుల్కల్ మండలం బస్వాపూర్, జోగిపేటలోని ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని పరిశీలించారు. అయినప్పటికీ, రఘునందన్ రావు ఇంకా తన వంతుప్రయత్నాలు సాగిస్తున్నట్టు సమాచారం. ఎవరి పంతం నెగ్గుఉతుందోనని ప్రభుత్వం వాళ్ల చెల్లె తీసువచ్చిందని చెప్పారు.



ఆరు వారాలు

'రైతు ముంగిట శాస్త్రవేత్త'

- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- మే నెల 5 నుంచి ప్రారంభం
- రైతులకు అవగాహన కల్పించనున్న శాస్త్రవేత్తలు 7
- వచ్చే సీజన్ నుంచి గ్రామాల్లోనే విత్తనోత్పత్తి దిశగా సన్నాహాలు
- గ్రామానికి ఐదుగురి చొప్పున రైతుల ఎంపిక

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర 7



సంగారెడ్డిలో నిర్మానుష్యంగా మార్కెట్ రోడ్డు

7

ఎండ ప్రచండం

- నిప్పుల కొలిమిలా ఉమ్మడి జిల్లా
- నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పొడ్చన్‌పల్లిలో రికార్డు స్థాయిలో 44.3 డిగ్రీలు
- 119 గ్రామాల్లో 40 డిగ్రీలకుపైగా నమోదు

మెతుకు సీమ అగ్నిగుండంలా మారుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. నాలుగు రోజులుగా సూర్యుడు నిప్పులు చిమ్ముతున్నాడు. 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం ఆందోళనను కలిగిస్తోంది. సోమవారం 42.2 డిగ్రీలు, మంగళవారం 42.8 డిగ్రీలు, బుధవారం 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గురువారం ఏకంగా 44 డిగ్రీలకు చేరుకున్నది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో రికార్డు స్థాయిలో 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 119 గ్రామాల్లో 40 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడేళ్ల తర్వాత ఏప్రిల్‌లోనే ఈస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

-మెదక్/ కోహీర్

వక్ఫ్ భూములపై కన్ను

- కబ్జా చేసి అమ్ముకునే యత్నం
- పాట్లుగా మార్చేందుకు కడీలు పాతిన కొందరు

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ నడిబొడ్డున రూ. కోట్ల విలువ చేసే వక్ఫ్ భూములు కబ్జాకు గురవుతున్నాయి. రక్షణా చర్యలు చేపట్టకపోవడంతో ఈ భూములపై కన్నేసిన కొందరు ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. బహిరంగంగానే వక్ఫ్ భూముల్లో గద్దల్లా వాలుతున్నా అధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదని అంటున్నారు.





నర్సాపూర్‌లో వక్ఫ్ భూముల్లో ప్లాట్లుగా మార్చేందుకు పాతిన కడీలు, విచారణ చేస్తున్న అధికారులు

నర్సాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణ పరిధి 1,25,9,60 సర్వే నంబర్లలో బస్టాండ్‌కు అతి సమీపంలో వక్ఫ్ భూములు ఉన్నాయి. జాతీయ రహదారికి దగ్గరలో ఉన్న ఈ భూములను రక్షించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణలకు గురవుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు వక్ఫ్ బోర్డు అధికారులు వచ్చి విచారణ జరపడం, నోటీసులు ఇవ్వడంతో సరిపెడుతున్నారు. తాజాగా ఈ సర్వే నంబర్ల పరిధిలో సుమారు రెండు ఎకరాల మేర భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు వారు ఆ స్థలంలో కడీలు పాతారు. ఇక్కడ గజం భూమి విలువ రూ. 25 వేల వరకు పలుకుతుండటంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఈ విషయంపై వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ సాబేర్ హుస్సేన్‌ను ఫోన్‌లో సంప్రదించడంతో తమకు ఫిర్యాదు అందిందని, తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసులకు సూచించినట్లు చెప్పారు. ఈమేరకు గురువారం ఆర్ఐ ఫైజల్, సర్వేయర్ అభిలాష్‌తో పాటు పోలీసు సిబ్బంది ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. విలువైన భూమి ప్లాట్లుగా చేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్న విషయం వాస్తవమేనని గుర్తించారు. వక్ఫ్ భూమిలో వేసిన కడీలను వెంటనే తొలగించాలని, లేదంటే చర్యలు తప్పవని బాధ్యులను హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన సంఘటన బెజ్జంకి, వర్గల్, మర్కూక్ మండలాల్లో గురువారం చోటు చేసుకున్నది.

బెజ్జంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. బెజ్జంకి మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామానికి చెందిన బీరెడ్డి నక్షత్రమ్మ(55), ఆమె భర్త ఆనందరెడ్డి, దాచారం గ్రామానికి చెందిన కొలిపాక మంజుల(ప్రభుత్వ ఉద్యోగి), గుగిళ్ల గ్రామానికి చెందిన పొన్నం సాయికృష్ణ(బీటెక్ విద్యార్థి), బెజ్జంకికి చెందిన ఐలేని నవీన్‌రెడ్డి కరీంనగర్‌కు వెళ్లేందుకు గురువారం ఉదయం బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఓ ఆటోలో ఎక్కారు. రేణికుంట వద్ద రాజీవ్ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఓ లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నక్షత్రమ్మ మృతిచెందింది. ఆనందరెడ్డి, మంజుల, సాయికృష్ణ, నవీన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆనందరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నక్షత్రమ్మ మృతితో బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో విషాదం నెలకొంది.

వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొని..

వర్గల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మర్కూక్ మండలం ఎర్రవల్లికి చెందిన గణేశ్(40) భార్య పద్మ, కుమారుడు మనోజ్, కూతురు మానసతో కలిసి కొంతకాలంగా గజ్వేల్ పట్టణంలో నివాసముంటున్నాడు. గురువారం సాయంత్రం గజ్వేల్ నుంచి గౌరారం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. గౌరారం సమీపంలోని సింగాయిపల్లి క్రాస్ రోడ్డు వద్ద వెనక నుంచి వచ్చిన (టీజీ 08 ఏ 6615) నంబరు గల ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో గణేశ్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి పైనుంచి టిప్పర్ వెళ్లడంతో..

మర్కూక్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నిద్రిస్తున్న యువకుడి పైనుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మర్కూక్ మండలం కర్కపట్లకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలోని ఓ రైతుకు ప్రభుత్వ భూమి నుంచి మట్టిని టిప్పర్‌లో బుధవారం రాత్రి తరలిస్తున్నాడు. సుమారు ఒంటిగంట ప్రాంతంలో టిప్పర్‌లో ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టి నింపుతుండగా.. మరో టిప్పర్ ఆగి ఉన్నది. ఆగి ఉన్న టిప్పర్ వెనకాల కర్కపట్ల గ్రామానికి చెందిన భీమని కరుణాకర్(24) నిద్రిస్తున్నాడు. ఇది గమనించని టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వెనక్కి తీశాడు. టిప్పర్ యువకుడి పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జహీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. నాగర్‌కర్నూల్- ఈదులకుంటతండాకు చెందిన గంషీబాయి(55) తన కుమారుడు మూడావత్ రాజుతో కలిసి రెండు నెలల క్రితం జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ శివారులో గల ఓ వెంచర్‌లో పనిచేసేందుకు వచ్చింది. అయితే ఈనెల 19న ఆమె అదృశ్యమైంది. కుమారుడు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం వెంచర్‌లోని సంప్‌హౌజ్‌లో శవమై కనిపించింది. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

సంపులో పడి వ్యక్తి...

ములుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంపులో పడి వ్యక్తి మృతిచెందాడు. ములుగు మండలం తునికిబొల్లారం గ్రామానికి చెందిన బద్దం బలవంతరెడ్డి(34) గురువారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద నీటి సంపులో మోటార్ నడపడం లేదని చూస్తున్న క్రమంలో కాలుజారి పడిపోయాడు. వెంటనే తన తమ్ముడు కోటిరెడ్డి తాళ్ల సహాయంతో బయటకు తీసే క్రమంలో అప్పటికే నీట మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి దగ్గరలోని ఆర్వీఎం ఆస్పత్రికి తీసుకురాగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తొగుట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన మన్నె భాస్కర్(3) కూలీ పనులతో పాటు ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. అతడి భార్య మూడేళ్ల క్రితం మృతిచెందింది. దాంతో తనకున్న పాత ఇంటిపై ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.3 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. అంతేకాకుండా గ్రామంలో పంట చిట్టీలే వేసి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక భాస్కర్ తాగుడుకు బానిసయ్యాడు. గురువారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ గంట రేణుక రవిందర్ కోరారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్సాపూర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడతండాకు చెందిన నేనావత్‌జాంగిర్(35) కుటుంబపోషణ భారంగా భావించి ఈనెల 12న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ లింగం చెప్పారు.

లింగాపూర్‌లో యువతి అదృశ్యం

నర్సాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఓ యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కంచర్ల కృష్ణవేణి(19) బుధవారం నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చింది. తల్లి చంద్రకళతో పాటు బంధువులు డాక్టర్‌కు చూపించుకోవడానికి వెళ్లగా కృష్ణవేణి బయట రిసెప్షన్‌లో కూర్చుని ఉంది. బయటకు వచ్చిన తల్లికి కృష్ణవేణి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటర్మీడియట్‌లో తెలుగు తప్పక చదవాలి

జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐతా చంద్రయ్య



మాట్లాడుతున్న జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌లో తెలుగు భాష తప్పక చదవాలని, దీని స్థానంలో సంస్కృతం ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం మానుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐతా చంద్రయ్య సూచించారు. గురువారం సిద్దిపేటలోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పరిపాలన భాషగా ప్రతీ కార్యాలయం తెలుగు భాష ద్వారానే కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. అధికార భాష హోదా దక్కిన తెలుగును కళాశాల విద్యలో తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంతకాలమే మనకు గౌరవం దక్కుతుందని, ఇతర భాష వల్ల వెనుకబడి పోతున్నామన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ మార్కుల కోసం ఇంటర్మీడియట్‌లో సంస్కృతం విద్యార్థులకు అనువుగా మారిందని, అందువల్ల తెలుగు భాషకు ముప్పు కలుగుతుందని తెలిపారు. తెలుగు భాష గౌరవం దక్కాలంటే ఇంటర్మీడియట్‌లో ప్రతీ ఒక్కరు తెలుగు చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలోనూ ఈ విషయాన్ని ఎన్నోసార్లు ప్రస్తావించామన్నారు. తెలుగు భాష మూలంగానే అన్య భాషలకు గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి బస్వ రాజుకుమార్, చీకోటి రాములు, వంగరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

సంగారెడ్డి ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ 9వ తేదీ నుంచి 14 వరకు జిల్లా కోర్టు ఆవరణలో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర తెలిపారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో గురువారం బ్యాంకు అధికారులు, చిట్‌ఫండ్స్ యాజమాన్యాలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువర్గాలు చిన్నచిన్న తగాదాలు పడి కేసులు నమోదు చేసుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా దిగ్వాల్‌లోని 65వ నంబర్ జాతీయ రహదారి

ఎండ ప్రచండం

నిప్పుల కొలిమిలా ఉమ్మడి మెదక్ జిల్లా

- నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మెదక్ జిల్లా పొడ్చన్‌పల్లిలో రికార్డ్‌స్థాయిలో 44.3 డిగ్రీలు
- 119 గ్రామాల్లో 40 డిగ్రీలకుపైగా నమోదు

మెదక్/కోహీర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని పొడ్చన్‌పల్లిలో ఈ వేసవిలోనే రికార్డ్‌స్థాయిలో 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేటలో 43.4 డిగ్రీలు, అలాగే సంగారెడ్డి జిల్లాలోని వట్‌పల్లి మండలంలోని పల్వట్లలో 42.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడేళ్ల తర్వాత ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 2022 నుంచి పరిశీలిస్తే ఏప్రిల్ 23 నాటికి వరుసగా 38.6, 39.1, 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏకంగా 44.3 డిగ్రీలకు చేరుకుని ఆందోళనను కలిగిస్తున్నది. గురువారం మెదక్, సిద్దిపేట జిల్లాలోని 20 ప్రాంతాలలో 43 డిగ్రీల కంటే పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 119 ప్రాంతాలలో 40 నుంచి 44 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సుర్రుమంటున్న సూర్యుడు

ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఎండల తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు వీస్తున్న తీవ్రమైన వేడిగాలులతో సతమతమవుతున్నారు. మధ్యాహ్న సమయంలో ద్విచక్ర వాహనాలు ప్రధాన రోడ్లపైన కనిపించడం లేదు. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ మధ్యాహ్నం వేళ జనసంచారం తగ్గింది. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పనులున్న వారు ఉదయమే ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. సాయంత్రం వేళ బయటకు వస్తున్నారు. ధాన్యం ఆరబెడుతున్న రైతులు, ఉద్యోగాలకు వెళ్లే వారు, ఇతర పనుల నిమిత్తం జిల్లా కేంద్రాలకు వచ్చే వారు ఎండలకు వేసారిపోతున్నారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ వేసవిలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా అనారోగ్యానికి గురైనట్లు తమ రికార్డులలో నమోదు కాలేదని మెదక్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నెల 16న రామాయంపేట పట్టణంలో కూలీ పని చేసుకునే ఎరుకల బాలయ్య మండుటెండలకు అస్వస్థతకు గురై మృతి చెందినప్పటికీ, వడదెబ్బ కారణమని వైద్యారోగ్య శాఖ రికార్డుల్లో పేర్కొనలేదు. పైగా ప్రభుత్వ వైద్యురాలు వివరణ ఇస్తూ మృతుడికి వడదెబ్బ లక్షణాలు లేవని నిర్ధారించారు.



సంగారెడ్డిలో ఓ వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోగా అతనికి సపర్యలు చేస్తున్న స్థానికులు

మూడేళ్లలో విపరీతంగా పెరిగాయి



గడచిన మూడు సంవత్సరాల రికార్డులను పరిశీలిస్తే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయి. పైగా మండుటెండల్లో వడగండ్ల వానలు, ఈదురుగాలులతో ప్రకృతి ప్రకోపిస్తోంది. పర్యావరణ కాలుష్య దుష్ప్రభావంతోనే ఈ విధంగా పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. 2022లో ఏప్రిల్‌లో 38.6 డిగ్రీలు నమోదు కాగా 2025 ఏప్రిల్ 24న 44.3 డిగ్రీలు నమోదవడం పరిశీలిస్తే వాతావరణంలో ఏటా చోటుచేసుకుంటున్న మార్పులు అవగతమవుతాయి.

- బద్రీనాథ్, మెదక్ జిల్లా గణాంక అధికారి

మెదక్ జిల్లాలో

పొడ్చన్‌పల్లి 44.3, నర్సాపూర్ 43.7, పాతూర్ 43.6, దామరంచ 43.6, శివ్వంపేట్ 43.5, కౌడిపల్లి 43.5, కుల్చారం 43.5, మాసాయిపేట్ 43.3, వడ్డీ 43.3, చిట్కుల్ 43.2, మెదక్ 43.2, అల్లాదుర్గ 43.1, శంకరంపేట్(ఆర్) 43.1, రాజ్‌పల్లి 42.9, కొత్తపేట్ 42.8, వెల్దుర్తి 42.8 టేక్మాల్ 42.8, సర్దన 42.7, నర్లాపూర్ 42.6, చేగుంట 42.6, మినీపూర్ 42.2, శంకరంపేట(ఏ) 42.1, శివనూర్ 42.1, చిప్పల్‌తుర్తి 42.1, లింగాయపల్లి 42.0, బోడమాట్ 42.0, రేగోడు 41.7, ఇస్లాంపూర్ 41.5, కాగజ్‌మద్దూర్ 41.3, దొంగలధర్మారం 41.1, లక్ష్మాపూర్ 41.1, మొయినాబాద్ 40.9, రామయంపేట్ 40.7 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో..

సిద్దిపేట 43.4, రాఘవపూర్ 43.3, శనివారం 43.3, సముద్రాల 43.2, కోహెడ 43.1, నారాయణపేట్ 43.0, బెజ్జంకి 43.0, చిట్యాల 42.9 పోతరెడ్డిపెట్ 42.9 తుక్కాపూర్ 42.8 హబ్సీపూర్ 42.8 హస్నాబాద్ 42.8, దౌల్తాబాద్ 42.7, రేబర్తి 42.6, పెద్దకోడూరు 42.6, వెంకటరావుపేట్ 42.2, బెజుగాప్ 42.1, తిప్పారం 42.1, ముస్త్యాల 42.1, గండిపల్లి 42.0, బేగంపేట్ 42.0, మిరుదొడ్డి 41.8, లకుడారం 41.8, గౌరారం 41.8, నంగనూరు 41.7, రాంపూర్ 41.6, మునిగండప్ప 41.6, ధూల్మిట్ట 41.5, కొమురవెల్లి 41.4, కొడకండ్ల 41.4, చికోడ్ 41.4, గజ్వేల్ 41.3, అంగడికిష్టాపూర్ 41.2, కట్కూర్ 41.1, చాట్లపల్లి 40.8, కొండపాక 40.8, ములుగు 40.7, రామారం 40.6, ములుగు 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో

పాల్వట్ల 42.7, నిజాంపేట్ 42.7 మల్‌చెల్మ 42.6, నారాయణఖేడ్ 42.6, లక్ష్మీసాగర్ 42.6, సింగాపూర్ 42.5, కల్హేర్ 42.4, సత్వర్ 42.4, వట్‌పల్లి 42.4, కడ్పల్ 42.3, కంగ్టి 42.2, నాగలిగిద్ద 42.1 సుల్తాపూర్ 42.1, దిగ్వాల్ 42.1, హత్నూర 42.0, కంది 42.0, పుల్కల్ 41.9, చౌటకూర్ 41.9 అల్గోల్ 41.9, జిన్నారం 41.8, గుండ్లమచునూరు 41.8, ముక్తాపూర్ 41.8, న్యాల్‌కల్ 41.7, కొండాపూర్ 41.7, మొగుడంపల్లి 41.6, మనూర్ 41.6, పాశమైలారం 41.6, గుమ్మడిదల 41.6, రాయికోడు41.5, రుద్రారం 41.4, కిష్టారెడ్డిపేట్ 41.4, రామచంద్రపురం 41.4, సంగారెడ్డి 41.3, జహీరాబాద్ 41.2, బిహెచ్‌ఈఎల్ 41.2, ఝరాసంఘం 41.2, పటాన్‌చెరు 41.2, ఆల్మాయిపేట్ 41.1, సదాశివపేట 41.1, మునిపల్లి 41.0, కోహీర్ 40.9 అన్నసాగర్ 40.8, కంకోల్ 40.5, నల్లవల్లి 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



రజతోత్సవ అభిమానం

చేర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ ఈనెల 27వతేదీన జరగనున్న నేపథ్యంలో చేర్యాల పట్టణానికి చెందిన జి.మనోహర్ ప్రత్యేక వేషధారణతో వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. సూర్యభగవానుడి తరహా రూపంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత చిత్రాలు రూపొందించిన గులాబీరంగు ఫ్లెక్సీని ధరించాడు. చేత మెగామైక్ పట్టుకుని రజతోత్సవ సభకు తరలిరావాలని, గులాబీ జెండాయే అండ అని సూచిస్తున్నాడు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో నెత్తిన గొడుగు పట్టుకుని సభకు తరలిరావాలంటూ అభ్యర్థించడాన్ని చూసి స్థానికులు ఆయనను అభినందించారు.

ఆరు వారాలు 'రైతు ముంగిట శాస్త్రవేత్త'

- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- మే నెల 5 నుంచి ప్రారంభం
- రైతులకు అవగాహన కల్పించనున్న శాస్త్రవేత్తలు
- వచ్చే సీజన్ నుంచి గ్రామాల్లోనే విత్తనోత్పత్తి దిశగా సన్నాహాలు
- గ్రామానికి ఐదుగురి చొప్పున రైతుల ఎంపిక

గజ్వేల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పలు అంశాలపై అవగాహన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. రైతు ముంగిట శాస్త్రవేత్తలు పేరిట మే 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వారాల పాటు నిర్వహించనున్నారు. జూన్ 13 వరకు కొనసాగుతుంది. రాష్ట్రంలోని 415 మంది శాస్త్రవేత్తలు, 200 గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ క్రమంలోనే సిద్దిపేట జిల్లాలోని 26 మండలాలకు గానూ 24 మండలాలను ఎంపిక చేశారు. మండలానికి ఒక గ్రామానికి చొప్పున 24 గ్రామాల రైతులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

విత్తన ఎంపికపై అవగాహన

రైతులు ముఖ్యంగా విత్తన ఎంపిక కీలకమని గుర్తించడం, విత్తనం తీసుకున్న వెంటనే రసీదును తీసుకోవాలని తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు. పంట మార్పిడి వైపు ప్రోత్సహిస్తారు. పత్తి, వరి కొయ్యలు కాల్చడంతో కలిగే నష్టాలు, అధికంగా యూరియా(నత్రజని) వాడకంతో కలిగే దుష్ప్రభావాలను తెలపనున్నారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్టి విత్తన సాగుతో కలిగే ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఇందుకు సిద్దిపేట జిల్లాలోని 24 మండలాల్లో నాలుగు బృందాలు మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకుని అవగాహన కల్పించనున్నారు. ఈ బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, ఇద్దరు బీఎస్సీ లేదా పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతున్న విద్యార్థులు, వ్యవసాయశాఖ అధికారులు ఉండనున్నారు. ఆయా గ్రామాల్లోని రైతువేదికలు, పంచాయతీ కార్యాలయాల వద్ద రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని శాస్త్రవేత్త శ్రీదేవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త (ఫైల్)

విత్తనోత్పత్తికి ప్రణాళిక

గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలను తయారు చేయాలన్న సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ యాసంగి లేదా వచ్చే రబీ సీజన్‌లో ఈ ప్రణాళికను ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామానికి ఐదుగురు రైతుల చొప్పున ఎంపిక చేసి వారికి యూనివర్సిటీ ఆధ్వర్యంలో రీసెర్చ్ చేసిన వంగడాలను అందజేసి గ్రామస్థాయిలో నాణ్యమైన విత్తనాలను తయారు చేసేందుకు కసరత్తు చేశారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆసక్తి గల రైతుల జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. ఈ రైతులకు వరి, మినుములు, కందులు వంటి వంగడాలను అందజేసి విత్తనోత్పత్తిని గ్రామాల్లోనే చేసి రైతులపై విత్తన భారం పడకుండా చూసేందుకు యత్నాలు చేస్తున్నారు.

బీఈఎల్‌కు గీతం విద్యార్థుల ఎంపిక



భట్టు సాయిశ్రీజ, గాయత్రి రచన త్రిపురాణ, కక్కిరేణి మణికంఠ

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం చివరి ఏడాదికి చెందిన ముగ్గురు విద్యార్థులు భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు ఎంపికయ్యారు. భట్టు సాయిశ్రీజ, గాయత్రి రచన త్రిపురాణ, కక్కిరేణి మణికంఠ ఐదు సంవత్సరాల కాలానికి ఫిక్స్ డ్ టర్మ్ ఇంజనీర్స్ (ఈ టు గ్రేడ్)గా ఎంపికైనట్టు యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. విద్యార్థులను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి అభినందించారు.

ఇదే స్ఫూర్తితో చదివి డాక్టర్ కావాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని మంగళి అక్షయను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యనభ్యసిస్తూ డాక్టర్ కావాలని ఆకాంక్షించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిందని కొనియాడారు. సంగారెడ్డికి చెందిన నిరుపేద కుటుంబంలోని పద్మ, శ్రీశైలం దంపతుల అమ్మాయి అక్షయ ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, కార్యదర్శి శ్రీశైలం, రాము, అంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అన్నవిని అభినందించిన జనగామ కలెక్టర్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని అన్నవిని జనగామ కలెక్టర్ రిజ్వాన్ పాషా అభినందించారు. జగదేవ్‌పూర్ మండలం ధవలాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ డిజి వెంకటేష్ కూతురు దూస అన్నవి జనగామ జిల్లా కొడకండ్లలోని గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతుంది. ఇటీవల ఇంటర్ ఫలితాలు రావడంతో 470 మార్కులకు 467 మార్కులు సాధించి స్టేట్‌లో రెండె ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ పాషా విద్యార్థినిని గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

మహాశివుడి చెంత మహాభాగ్యం

- కేదార్‌నాథ్‌లో సిద్దిపేట వాసుల అన్నదానం
- నేడు వెళ్లనున్న సరుకుల లారీలు
- రెండు నెలల పాటు నిత్యాన్నదాన శిబిరం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కేదార్‌నాథ్‌లో అన్నదాన శిబిరానికి అవసరమైన సరుకుల వాహనాలకు ప్రత్యేక పూజల అనంతరం శుక్రవారం సిద్దిపేట శరభేశ్వరాలయం వద్ద నుంచి కేదార్‌నాథ్‌కు బయలుదేరనున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక, ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పాల్గొంటారని కేధార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చీకోటి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి అయిత రత్నాకర్, కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పీఆర్‌వో మంకాల నవీన్ కుమార్, సమితి సభ్యులు తెలిపారు. గురువారం సిద్దిపేటలోని పాతగంజి హనుమాన్ ఆలయంలో అన్నదానం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న కేధార్‌నాథ్ అన్నదాన సేవ సమితి సభ్యులు

మొదటి తెలుగు లంగర్

సిద్దిపేటకు చెందిన కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు 2019లో సేవాసమితిని ప్రారంభించారు. ఈ సేవా సమితిలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు గౌరవ సభ్యులుగా ఉన్నారు. సమితి సభ్యుల చొరవ, దాతల సహకారంతో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ స్వామి చెంత దక్షిణ భారతదేశంలోనే మొదటి తెలుగు వారి అన్నదాన శిబిరం (లంగర్) ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నాలుగు పర్యాయయాలు అన్నదాన శిబిరం కొనసాగింది. ఈసారి ఐదోసారి ఏర్పాటు చేస్తున్నారు. కేదారేశ్వరుడి ఆలయానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని సోన్ ప్రయాగ్ బేస్ క్యాంపు పార్కింగ్ సముదాయం దగ్గర సిద్దిపేట వారి శిబిరం ఉంటుంది. అలాగే కేదార్‌నాథ్ ఆలయానికి దగ్గరగా మరో అన్నదాన కేంద్రాన్ని భక్తుల కోరిక మేరకు ప్రారంభించారు. ఇక్కడికి భక్తులు ఎక్కువగా వచ్చే రెండు నెలల పాటు ప్రతీరోజు శిబిరం కొనసాగుతుంది. రోజూ దాదాపు 10 వేల మంది ఈ శిబిరం ద్వారా ఆకలి తీర్చుకుంటారు.

మంచుకొండల్లో మైమరిపించే రుచులు

మంచుకొండలో వెలిసిన దేవదేవుడి దర్శనం అంటే మామూలు విషయం కాదు. చుట్టూ మంచు కొండలు.. లోయలు మైనస్ డిగ్రీ ఉష్ణోగ్రతలు.. భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయి. అలాంటి చోట సిద్దిపేట కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి భక్తులకు రుచికరమైన వంటలు వడిస్తూ శివ భక్తుల మన్ననలు పొందుతున్నది. ఎన్నో వ్యయప్రయాసలతో వచ్చే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనం అందించనున్నారు. అన్నం, పులిహోర, పెరుగన్నం, అల్పాహారాలు, మిఠాయిలు, పానీపూరి వరకు అన్ని రుచికరమైన వంటలను సమకూర్చుతున్నారు. కొంత మంది కోరిక మేరకు టీ, కాఫీలను అందిస్తారు. గతంలో ఒక లారీలో సరుకులు కేదార్‌నాథ్ వెళ్లేవి కానీ, ఈ సంవత్సరం 15 నుంచి 20 లక్షల విలువైన సరుకులు రెండు లారీల్లో వెళ్లనున్నాయి. ఇవే కాకుండా అక్కడ స్థానికంగా గ్యాస్, కూరగాయలు, పాలు వంటి వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. అలాగే ట్రాన్స్‌పోర్టుకు కూడా లక్షల్లో ఉంటుంది. సహకరిస్తున్న దాతలకు సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



పాలమాకుల నుంచి వెంకటాపూర్ వెళ్లే దారిలో చెట్లను విద్యుత్ అధికారులు వైర్లకు తాకుతున్నాయని కొట్టివేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రతకు నీడ కరువైందని రోడ్డు వెంట వెళ్లే పలువురు విద్యుత్ శాఖపై మండిపడుతున్నారు. - నంగునూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

పోషకాహారంతోనే ఎక్కువ ప్రొటీన్

కంది, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారంతోనే ఎక్కువగా ప్రొటీన్ ఉంటుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుశీల అన్నారు. మండల కేంద్రమైన కంది లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో న్యూట్రీషన్ లడ్డూను తయారుచేసి బాలింతలు, గర్భిణులు, కిశోర బాలలలకు, చిన్నారులకు పంపిణీ చేశారు.

ఆర్టీసీ డిపో జేఏసీ కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్‌ఆర్టీసీ సంగారెడ్డి డిపో జేఏసీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. రాష్ట్ర జేఏసీ నాయకులు రాఘవ రెడ్డి, పల్లె కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా ఎండీ. ఎక్బాల్‌పాషా, వైస్ చైర్మన్ రవీందర్, కుమార్, కన్వీనర్‌గా బసవేశ్వర్, కోశాధికారిగా గురురాజ్, ప్రచార కార్యదర్శులుగా విక్రమ్, వైఎస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భూషణం, అడ్వైజర్లుగా భూపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, మహమూద్, సభ్యులుగా విజయ, శ్రీనివాస్, బాలమణిని ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ సంబరాలు

కొండాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తొగర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వార్షికోత్సవ సంబరాలు నిర్వహించారు. పిల్లలు విద్యలో సాధించిన ఘనతను చాటి చెప్పేందుకు అబ్రేవేషన్ బుక్స్, అసెస్మెంట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేసి చిన్నారులకు మెడల్స్ వేసి సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌తండాలో గురువారం సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు.

కట్టమైసమ్మకు బోనాలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్‌లో కట్టమైసమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామ పురవీధుల గుండా గుడివద్దకు వెళ్లారు. అమ్మవారికి ఓడిబియ్యం, చీరలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే 'భూభారతి'

● సంగారెడ్డి కలెక్టర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు/నాగల్‌గిద్ద, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విబేధాలు లేకుండా భూ సమస్యలు పరిష్కారం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన మనూరులో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. గతంలో ధరణి ద్వారా అనేక భూ సమస్యలు ఉండేవని, వాటి ద్వారా భూ ఆక్రమణలు వల్ల గ్రామాల్లో గొడవలు జరిగేవన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల మేధావులచే అధ్యయనం చేసిన తర్వాతే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతీ మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విష్ణుసాగర్ పాల్గొన్నారు. అనంతరం బోరంచ నల్లపోచమ్మతల్లిని కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న శ్మశానవాటికను ఇతర ప్రాంతానికి మార్చాలని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాగల్‌గిద్ద మండలంలో ఏర్పాటుచేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు వచ్చిన కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు.



మనూరు: బోరంచ నల్లపోచమ్మతల్లిని దర్శించుకున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



వెల్దుర్తి రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న రాహుల్‌రాజ్

ప్రభుత్వ కార్యాలయాలకు కేడర్ స్ట్రెంత్ ఇవ్వండి

పుల్‌కల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ కేంద్రంగా కొత్తగా ఏర్పాటైన మండల కార్యాలయాలకు కేడర్ స్ట్రెంత్‌ను ఇవ్వాలని గ్రామస్థులు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. చౌటకూర్‌లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ వెళ్తున్న క్రమంలో గ్రామస్థులు కలిసి ప్రభుత్వ భవనాలు, రెగ్యులర్ అధికారులు, సిబ్బంది కొరత విషయాన్ని వివరించారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం: కలెక్టర్

వెల్దుర్తి/నిజాంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో సమస్యలు పరిష్కారమవుతాయని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. వెల్దుర్తి రైతువేదికలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కరించడానికి ధరణి పోర్టల్‌లో లేని అవకాశాలు భూభారతి చట్టంలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి నీలిమ, తహసీల్దార్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన నిజాంపేటలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆర్డీవో రమాదేవితో కలిసి మాట్లాడారు.

కాలనీల్లో సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

● పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం భారతీనగర్ డివిజన్ పరిధి మ్యాక్ సొసైటీ కాలనీలో పార్కు ప్రహరీ నిర్మాణానికి రూ.44 లక్షలు, హెచ్‌ఐజీ కాలనీలో రూ.28 లక్షల అంచనా వ్యయంతో సీసీరోడ్డు, ఎల్‌ఐజీ కాలనీలో పార్కు అభివృద్ధికి రూ.23 లక్షల అంచనా వ్యయంతో పనులను కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ దేవేందర్, ఏఈ ఫైజల్, పరమేష్‌యాదవ్, ఐలేష్‌యాదవ్, కాలనీల సభ్యులు పాపయ్య, యాదగిరి, నాగేశ్వరరావు, నందగోపాల్, రామారావు, యాదగిరిరెడ్డి, శామ్యూల్, లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ బాలవిహార్ పార్కులో రూ.50 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణ పనులను కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే తెల్లాపూర్ పురపాలక పరిధి ఘన్‌పూర్ గ్రామంలో నిర్వహించిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, విజయ్‌కుమార్, మాజీ సర్పంచులు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సీనాచంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మ్యాక్ సొసైటీ కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కష్టపడి చదివితేనే ఆశించిన ప్రతిఫలం: ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివితేనే ఆశించిన ఫలితాలు వస్తాయని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని శేఖాపూర్‌కు చెందిన షేక్ అద్నాన్‌సమీకి మొదటి సంవత్సరం ఎంపీసీలో 470/467 మార్కులు వచ్చాయి. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన కోహీర్ పట్టణానికి చెందిన ఐశ్వర్య అనే విద్యార్థినిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు.



షేక్‌అద్నాన్‌సమీకు కేక్ తినిపిస్తున్న మాణిక్‌రావు

ఉపాధిహామీ పనుల అవకతవకలపై గ్రామసభ

శివ్వంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై మండల పరిధిలోని చండి గ్రామపంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఉపాధి అవకతవకలపై డీఆర్‌పీ సత్యనారాయణ దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలో సందీప్, రాజేందర్‌కు సింగిల్ జాబ్ కార్డులు జారీ చేశారు. అలాగే పనిచేయని రామకృష్ణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మైసమ్మ, నాగిరెడ్డి, భాగ్యమ్మ, లక్ష్మి, వినోదతో పాటు మరికొంతమంది పేరిట మస్టర్లు, హాజరు నమోదుచేసి డబ్బులు తీసుకున్నట్లు గ్రామసభలో బయటపడింది. ఆదివారం 15 మంది పనిచేసినట్టు పేమెంటు చేయడం గమనార్హం. కొలతల్లో ఎక్కువచేసిన వారికి తక్కువ, తక్కువ చేసిన వారికి ఎక్కువ చేసినట్లు తెలిసింది. మాస్టర్ ముగిసిన తర్వాత ముగ్గురు పనిచేసినట్లు డీఆర్‌పీ గ్రామసభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవచారి, ఏ.రాజేష్, ఉపాధిహామీ కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.



ఉపాధిహామీ అవకతవకలను గ్రామసభలో వివరిస్తున్న ప్రజలు

మహిళా పారిశ్రామికవేత్తలకు వీ హబ్ దన్ను

మెదక్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు వీ హబ్ దన్నుగా నిలుస్తోందని డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామిక వేత్తలకు సూక్ష్మ చిన్న మధ్య తరహా సంస్థలు నెలకొల్పడానికి వీహబ్ ఏర్పాటుచేసిన ర్యాంపు ప్రోగ్రాంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలోకి అడుగుపెట్టే మహిళలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ.. వ్యాపారాభివృద్ధి, పెట్టుబడులు, నెట్‌వర్కింగ్, శిక్షణ, మెంటరింగ్ వంటి సేవలను వీ హబ్ అందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం పొందిన కౌడె సత్తయ్య ఇంట్లో గురువారం ఆమె సహపంక్తి భోజనం చేసి మాట్లాడారు. నిరుపేదలకు సన్నబియ్యంతో కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

యువత క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు

● అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో యువకులు రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మునిపల్లి మండలం పెద్దగోపులారం గ్రామంలో గురువారం కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను క్రాంతికిరణ్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశి కుమార్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

22 రోజుల్లో 26 శాతం పన్ను వసూలు

● ఎర్లీ బర్డ్ స్కీంకు విశేష స్పందన

జిన్నారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీలో ఎర్లీ బర్డ్ స్కీం కింద 26 శాతం ఆస్తిపన్ను వసూళ్లు జరిగినట్లు ఆర్వో, మేనేజర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఒకేరోజు పలు పరిశ్రమలకు చెందిన రూ.52 లక్షల పన్ను వసూళ్లను నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.5.80 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం కాగా.. ఈనెల 30 వరకు పన్ను చెల్లించినవారికి ఎర్లీ బర్డ్ స్కీం కింద ప్రభుత్వం ఐదుశాతం రాయితీ కల్పించింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నెల 22 రోజుల్లోనే రూ.51.46 లక్షల పన్ను వసూళ్లతో 26 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు ఆర్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ దామోదర్, శ్రీనివాస్‌చారి, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హజ్‌కు వెళ్లే యాత్రికులకు వ్యాక్సినేషన్



సంగారెడ్డిలో హజ్ యాత్రికుడికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది, పక్కన వైద్యాధికారులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నుంచి వెళ్లనున్న హజ్ యాత్రికులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక గంజ్‌మైదాన్‌లోని నుమానియా మజీద్‌లో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి 100 మంది యాత్రికులకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు వివిధ రకాల టీకాలు వేశారు. సంగారెడ్డి జీజీహెచ్ ఆర్‌ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.పద్మావతి పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మనోహర్‌రెడ్డి, ఛీఫ్ డైటీషియన్ బాలస్వామి, సిబ్బంది శ్రీనివాస్, నాగమణి ఉన్నారు.

శఠగోపం బహూకరణ

నారాయణఖేడ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయానికి మెదక్ జిల్లాలోని పెద్ద శంకరంపేటకు చెందిన భక్తులు గడ్డం వజ్రమణి, ఆమె కుమారులు వెంకటేశం, శ్రీనివాస్ కుటుంబీకులు రూ.25 వేలు విలువ చేసే పావుకిలో వెండితో తయారు చేయించిన శఠగోపాన్ని గురువారం బహూకరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మద్దతు ధర

పుల్‌కల్/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ టి.మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో గురువారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. పక్షంరోజుల్లోగా యాసంగి కోతలు ముగియనున్నాయని, ముందస్తు ప్రణాళికతో రైతులకు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బానూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి సొసైటీ పరిధి గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ సందర్శించి, ధాన్యాన్ని పరిశీలించారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

మెదక్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎస్జీఎఫ్ క్రీడాకారులు ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. మార్చి 14 నుంచి 16 వరకు వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచిన మెదక్ జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొంటారని తెలిపారు.

ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ● కొవ్వొత్తులతో సంతాపం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీఎన్జీవోలు



చేగుంటలో నల్లబ్యాడ్జీలతో బీజేపీ నాయకుల నిరసన

మెదక్ అర్బన్/చేగుంట/అల్లాదుర్గం/కొల్చారం/రేగోడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ తెలిపారు. గురువారం స్థానిక సంఘ భవనంలో అత్యవసర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి పర్యాటకులకు కొవ్వొత్తుల నివాళులర్పిస్తూ.. మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సహ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, రఘునాథరావు, శివాజీ, గోపాల్ సల్లావొద్దీన్ పాల్గొన్నారు. చేగుంటలో బీజేపీ మండలాధ్యక్షుడు చింతల భూపాల్ ఆధ్వర్యంలో శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అల్లాదుర్గం బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద హిందూ సంఘాల నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లిలో కెనరా బ్యాంకు నుంచి టీ జంక్షన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. యాత్రికులపై జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ జడ్పీటీసీ యాదగిరి, ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా జాయింట్ సెక్రటరీ సంతోష్‌రావు అన్నారు. గురువారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులివ్వాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చిన మాదిరిగానే అంగన్‌వాడీలకు వేసవి సెలవులివ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు డిమాండ్ చేశారు. గురువారం ఈ విషయమై సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవులు ఇవ్వాలన్నారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి మంగ, నాయకులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మిని టీచర్స్ అందరికి మే నెలంతా ఒకేసారి సెలవులు ప్రకటించాలని, మంత్రి సీతక్క ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: ఎస్‌ఐ

మునిపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజేష్‌నాయక్ హెచ్చరించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేట నుంచి కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను టిప్పర్‌లో తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు గురువారం మునిపల్లి పోలీసులు మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ టిప్పర్‌పై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేయగా... ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని గుర్తించి సీజ్‌చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇస్మాయిల్‌ఖాన్ పేట నుంచి తీసుకొచ్చిన ఇసుకను బీదర్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు టిప్పర్ డ్రైవర్ యాదుల్లాపాషా, టిప్పర్ యజమాని నయీం పటేల్ ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు టిప్పర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

జిన్నారంలో రెండోరోజూ తనిఖీలు



చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జిన్నారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు రెండోరోజు తనిఖీలు చేపట్టారు. జిన్నారంలో ఈనెల 22న శివుడి విగ్రహం ధ్వంసం ఘటన అనంతరం జరిగిన ఆందోళనల నేపథ్యంలో మండల కేంద్రం జిన్నారానికి నాలుగువైపులా పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించే పని ముమ్మరం చేశారు. గురువారం పలు గ్రామాలకు చెందిన అనుమానితులను అదుపులోకి తీసుకొని డీఎస్పీ స్థాయిలో విచారణ చేపట్టారు.

ఆర్‌వోబీ పనులను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్

జహీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని పశువుల మార్కెట్ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు, ఇంకా ఎన్నిరోజుల్లో పనులను పూర్తి చేయొచ్చని కిందిస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఆర్‌వోబీ పనుల తీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్‌ఈ రాంబాబు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

కంగ్టి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తడ్కల్‌లో రేణుకా ఎల్లమ్మ జాతరలో భాగంగా గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. వివిధప్రాంతాల నుంచి తరలివచ్చిన మల్లయోధులు నువ్వా నేనా అన్నట్లు పోటీల్లో తలపడ్డారు. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

వైభవంగా ఎడ్లబండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చరిత్రాత్మకమైన ర్యాకల్ ఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని బండ్ల ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో రెండోరోజు గురువారం దాదాపు 50కి పైగా బండ్లతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శన చేయించారు. గ్రామానికి చెందిన అమ్మవారి భక్తుడు చారి తన సొంత ఖర్చులతో 35 బండ్లను ఊరేగించారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

కొండాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జీపీ కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు గ్రామాన్ని స్వచ్ఛతగా ఉంచి విరివిగా మొక్కలను నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ నిషేధిస్తునట్లు తీర్మానించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచి నీటి సమస్యను ఎలా అధిగమించాలనే ప్రణాళికలను రుపొందించారు.

కొనసాగుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

పుల్‌కల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన డిమాండ్ల సాధనకు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె 6వ రోజుకు చేరుకున్నది. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఆరురోజులుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. గురువారం ఎమ్టీ ఛైర్స్-ఎమ్టీ ప్రామిసెస్ అనే నినాదంతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న శాశ్వత అసిస్టెంట్ ప్రొఫెసర్ల స్థానాలకు ప్రత్యామ్నాయంగా ఉన్నత విద్యార్హతలు కలిగిన తమను నియమించాలని కోరారు. ఈ సమ్మెకు డీటీఎఫ్ జిల్లా నాయకులు వినోద్, బి.సంగమేశ్వర్ మద్దతు తెలిపారు.